ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక

రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.
ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక
సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 4 | సంచిక: 142 | పేజీలు: 6 | వెల: రూ.3/- | సోమవారం 31 ఆగస్టు 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# నేపాల్ వరదల్లో...788కి పెరిగిన మృతుల సంఖ్య



## రంగంలోకి దిగిన భారత రెస్క్యూ బృందాలు

### మొత్తంగా 2,500 మందికి పైగా గల్లంతు.. కొనసాగుతున్న సహాయక చర్యలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 30 (ప్రభాత ఉదయం)**

నేపాల్-చైనా సరిహద్దుల్లో సంభవించిన జలప్రళయంలో నేపాల్‌లో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. నేపాల్‌లో మృతుల సంఖ్య 788కు చేరిందని నేపాల్ పోలీసులు ఆదివారం తెలిపారు. తాజా గణాంకాల ప్రకారం, చిత్వాన్ జిల్లాలో అత్యధికంగా 264 మంది మరణించారు. ఆ తర్వాత నవల్పరాసి ఈస్ట్‌లో 194, నవల్పరాసి వెస్ట్‌లో 120, గూర్ఖాలో 58, నువాకోట్‌లో 52, ధాడింగ్‌లో 50, తునహూన్‌లో 37, రుసువాలో 13 మంది ప్రాణాలు కోల్పోయారు.కాగా, నేపాల్ వరదల్లో ఇప్పటి వరకు 2502 మంది గల్లంతు అయ్యారని నేపాల్ పౌరులు ఉన్నారని పేర్కొంది. గుర్తుతెలియని మృతదేహాలను ..మిగతా 2లో



# రాష్ట్రంలో 42 రైల్వే స్టేషన్‌ల అభివృద్ధి

### వికారాబాద్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు

### ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డితో కలిసి పరిశీలించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు 30 (ప్రభాత ఉదయం)**

వికారాబాద్ రైల్వే స్టేషన్ ఆధుని కీకరణ పనులను 27 కోట్లతో చేపట్టారు. ఈ అభివృద్ధి పను లను చేవెళ్ల ఎంపీ కొండా విశ్వే శ్వర్ రెడ్డితో కలిసి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పరిశీలించారు. పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచనలు చేశారు. ఈ సందర్భం గా కిషన్ రెడ్డి మాట్లాడుతూ వికారాబాద్ రైల్వే స్టేషన్ ఆధుని కీకరణతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని 42 రైల్వే స్టేషన్‌లు ఏకకాలంలో అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. రూ.27 కోట్లతో వికారాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి ..మిగతా 2లో

# మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఫిక్స్

### అసెంబ్లీ మొదలయ్యేలోపు మార్పులు చేర్పులు!

### రాష్ట్ర కేబినెట్ విస్తరణకు ముహూర్తం ఖరారు

### మంత్రుల శాఖలను మార్చే పనిలో సీఎం, పీసీసీ వర్గాలు

### సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలనే ఆలోచనలో కాంగ్రెస్ వర్గాలు

**హైదరాబాద్, ఆగస్టు 30 (ప్రభాత ఉదయం)**



రాష్ట్రంలో మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారైందా? అసెంబ్లీ సమావేశాలు మొదలయ్యేలోపే మంత్రి మండలి విస్తరణ, ప్రక్షాళనకు సీఎం సిద్ధమవుతున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. గడిచిన నాలుగైదు రోజులుగా రేవంత్ రెడ్డి తన జట్టులో మార్పులు, చేర్పులపై కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలు, సామాజిక సమీకరణాలను ఇందుకు ప్రాతిపదికగా తీసుకుంటున్నట్లు సమాచారం. రాష్ట్ర కేబినెట్ విస్తరణకు ముహూర్తం ఖరారైనట్లు తెలుస్తోంది. వారం, పది రోజుల్లో మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశం ఉ ందని పార్టీ వర్గాల్లో విస్తృత చర్చ నడుస్తోంది. మంత్రి కొండా సురేఖపై చర్యలు తీసుకునే విషయంలో కొనసాగుతున్న జాప్యం, సీడబ్ల్యూసీ సమావేశం సమయంలో సీఎం రేవంత్ రెడ్డి రాహుల్‌గాంధీతో ప్రత్యేకంగా భేటీ కావడం ఇందుకు బలాన్ని చేకూరుస్తున్నాయి. నాలుగైదు రోజులుగా సీఎం కసరత్తు చేస్తుండడం లాంటి తాజా రాజకీయ పరిణామాలను ..మిగతా 2లో

# ప్రశాంతంగా నీట్ పీజీ పరీక్ష

### ఆ ఒక్క చోట మాత్రం పోస్ట్‌పోన్- ఏం జరిగిందంటే?

### సుమారు 2.73 లక్షలకు పైగా అభ్యర్థులు హాజరు

### కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో నిర్వహించిన పరీక్ష- 2 కేంద్రాల్లో నిలిచిన పరీక్ష- అభ్యర్థుల ఆందోళన

**న్యూఢిల్లీ, ఆగస్టు 30 (ప్రభాత ఉదయం)**

నీట్ పీజీ 2026 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. సుమారు 2.73 లక్షలకు పైగా అభ్యర్థులు వైద్య ప్రవేశ పరీక్షకు హాజరయ్యారు. ఈ పరీక్షను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్(ఎన్‌బీఈఎంఎస్) సంస్థ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో నిర్వహించింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్ష నిర్వహించారు. అయితే, రాజస్థాన్‌లోని జైపూర్‌లో 2 పరీక్ష కేంద్రాల్లో జరగాల్సిన పరీక్షలను వాయిదా వేశారు. విద్యుత్ అంతరాయంతో పరీక్షలు సజావుగా జరగలేదని, తిరిగి సెప్టెంబర్ 5న పరీక్ష నిర్వహించనున్నట్లు ఎన్‌బీఈఎంఎస్ వర్గాలు తెలిపాయి. మధ్యాహ్నం 3 గంటలకు రీ టెస్ట్‌ను నిర్వహించనున్నట్లు పేర్కొన్నాయి. పరీక్షా కేంద్రం, సవరించిన అడ్మిట్ కార్డులతో సహా తదుపరి వివరాలు విడిగా తెలియజేస్తామని ప్రకటించాయి. రీ షెడ్యూల్ చేసిన పరీక్ష కేంద్రాల్లో దాదాపు 300 ..మిగతా 2లో




# ప్రధాని మోడీకి ఉజ్బెకిస్థాన్ అత్యున్నత పురస్కారం

### వాణిజ్యం, రక్షణ, ఇంధన రంగాల్లో ఇరు దేశాధినేతల చర్చలు

### సహకారానికి భారత్ ఉజ్బెకిస్థాన్ మధ్య కీలక ఒప్పందాలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 30 (ప్రభాత ఉదయం)**



భారత్- ఉజ్బెకిస్థాన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలపడిందని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ఇరు దేశాల సంబంధాలను సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం ..మిగతా 2లో

# హైదరాబాద్‌లో రూ.183 కోట్ల భారీ జీఎస్టీ స్కామ్

### వ్యాపారి ఖాతా హ్యాక్ చేసి దందా!

2లో..



# సైప్రస్‌లో పడవ బోల్తా

### సుమారు 270 మంది ప్రయాణికులు...

**న్యూఢిల్లీ, ఆగస్టు 30 (ప్రభాత ఉదయం)**

సైప్రస్‌లోని కైరేనియా నుంచి తుర్కియేలోని టౌచుకు సుమారు 270 మంది ప్రయాణికులతో వెళ్తుండగా బోల్తా పడింది. వెంటనే రంగంలోకి దిగిన రెస్క్యూ బృందాలు.. దాదాపు 159 మందిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చగలిగాయి. పరిస్థితి చాలా తీవ్రంగా ఉందని, మిగతా వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని కైరేనియా మేయర్ మురాత్ సెన్‌కుల్ వెల్లడించారు. మరోవైపు, ఈ ఘటనలో భారీ ప్రాణనష్టం జరిగినట్లు స్థానిక మీడియా పేర్కొంది. కోస్ట్ గార్డుకు చెందిన పడవలు, హెలికాప్టర్లు సహా ప్రయాణికుల పడవలు సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. బాధితులను ఆసుపత్రులకు చేర్చేందుకు తీరంలో అంబులెన్సులను సిద్ధంగా ఉంచారు. అయితే, ప్రమాద సమయంలో పడవలో కచ్చితంగా ఎంతమంది ఉన్నారనే విషయంపై స్పష్టత లేదు.

# రూ.700 కోట్ల నిధులతో తెలంగాణలోని పర్యాటక ప్రదేశాల అభివృద్ధి


కార్యక్రమంలో ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి జి కిషన్ రెడ్డి


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీ డాక్ట్ డీకే అరుణ


కార్యక్రమానికి హాజరైన స్థానిక నాయకులు, ప్రజలు

### కేంద్ర బొగ్గు, గనుల శాఖల మంత్రి కిషన్ రెడ్డి.

### ఆలంపూర్ ఆలయాల అభివృద్ధికి కృషి.

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 30(ప్రభాత ఉదయం)**

ఆలంపూర్ ఆలయాల అభివృద్ధికి ప్రసాద్ పథకంలో భాగంగా ఇప్పటికే పలు పనులను చేయడం జరిగిందని భవిష్యత్తులో కూడా మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖల మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం అలంపూర్ ఆలయాల వద్ద మల్టీమీడియా, సౌండ్, లైట్స్ షోను ఇతర అతిధులతో కలిసి ప్రారంభించిన మంత్రి ఈ సందర్భంగా మాట్లాడారు. ఆధ్యాత్మికంగా ఎంతో విశిష్టత కలిగిన ఆలంపూర్ ఆలయాలను పెద్ద సంఖ్యలో భక్తులు దర్శిస్తుంటారని, భక్తులకు ప్రతి రోజు సాయంత్రం 25 నిమిషాల పాటు ఆలయ చరిత్రను తెలియజేస్తూ ప్రదర్శనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. తాను ఇదివరకు కేంద్ర పర్యాటక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రంలోని సుమారు 15 పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి రూ.700 కోట్ల నిధులను కేటాయించినట్లు తెలిపారు. రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు వచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషిచేసిందని పేర్కొన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఎన్నో దర్శనీయ స్థలాలను అభివృద్ధి చేసేందుకు పెద్ద ఎత్తున నిధులను కేటాయిస్తున్నట్లు తెలిపారు. గోల్కొండ కోట, ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల వద్ద సౌండ్ అండ్ లైట్ షో ఏర్పాటు చేశామన్నారు. జోగులాంబ రైల్వేస్టేషన్ ను అమృత్ పథకంలో భాగంగా అభివృద్ధి చేశామని, ఈ ప్రాంత వాసులు ఆలంపూర్ క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు సలహాలు ఇవ్వవచ్చని సూచించారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని అనేక ఆధ్యాత్మిక ప్రదేశాలను కూడా అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామని ఈ సందర్భంగా కేంద్రమంత్రి వివరించారు. మహబూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ... ఆలంపూర్ ఆలయాల వద్ద భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ పథకంలో భాగంగా అన్నదాన భవనం, విశ్రాంతి గదులు, ఫుడ్ కోర్టు, కల్చరల్ థియేటర్, తదితర విభాగాలతో పాటు తుంగభద్ర నదిలో బోటింగ్ సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. అమృత్ పథకంలో భాగంగా జోగులాంబ రైల్వే స్టేషన్ తో పాటు గద్వాల రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులు వేగవంతంగా జరుగుతున్నట్లు తెలిపారు. నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి మాట్లాడుతూ... ఆలంపూర్ ఆలయ విశిష్టతను తెలియజేస్తూ మల్టీమీడియా సౌండ్ లైట్స్ ప్రదర్శన ఏర్పాటు చేయడంతో టెంపుల్ టూరిజం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఆలంపూర్ ఆలయాలను మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతామని పేర్కొన్నారు. డోర్నకల్ నుంచి గద్వాలకు రైల్వే లైన్ ఏర్పాటుకు కూడా కృషి చేస్తున్నట్లు తెలిపారు.

# నేపాల్ వరదల్లో...788కి పెరిగిన మృతుల సంఖ్య

మొదటి పేజీ తరువాయి...

గుర్తించే ప్రక్రియ కోసం, వాటిని దేశవ్యాప్తంగా 21 ఆసుపత్రులలో భద్రపరిచినట్లు పేర్కొంది. గల్లంతైన వారిలో 933 మంది హైడ్రోపవర్ (జలవిద్యుత్) ప్రాజెక్టు కార్మికులు కాగా, 592 మంది విదేశీయులు, 127 మంది విదేశీ గ్రూపులతో కలిసి ప్రయాణిస్తున్న ప్రయాణిస్తున్న నేపాల్ పౌరులు ఉన్నారని వెల్లడించింది. అలాగే నేపాల్ పోలీస్, నేపాల్ ఆర్మీ, ఆర్మ్డ్ పోలీస్ ఫోర్స్, కస్టమ్స్ ఆఫీస్, ఇమ్మిగ్రేషన్ ఆఫీస్‌కు చెందిన సిబ్బంది కూడా గల్లంతైన వారి జాబితాలో ఉన్నారని పేర్కొంది. ప్రస్తుతం 239 మంది క్షతగాత్రులు ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారని లేదా డిశ్చార్జ్ అయ్యారని పేర్కొంది. వీరికి సేవలు అందించడానికి విపత్తు ప్రాంతంలో 6 ప్రత్యేక శస్త్రచికిత్స వైద్య బృందాలను మోహరించినట్లు తెలిపింది.

**సహాయక చర్యలు ముమ్మరం**

మరోవైపు 20వేల మంది భద్రతా సిబ్బంది భూమార్గం ద్వారా ఇప్పటివరకు మొత్తం 8,730 మందిని సురక్షిత ప్రాంతాలకు చేర్చారు. వైమానిక సిబ్బంది 363 హెలికాప్టర్ ట్రిప్పుల ద్వారా 236 మంది విదేశీయులతో సహా 3,081 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. వరదల్లో చిక్కుకున్న ఒక హైడ్రోపవర్ టన్నెల్ నుంచి 279 మందిని రక్షించారు. మరోవైపు శిథిలాల కింద ఉన్నవారిని రక్షించేందుకు భారత్, చైనా స్పెషల్ రెస్క్యూ బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టాయి. కాగా, గుర్తుపట్టలేనంతగా ఛిద్రమైన మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలు, సామూహిక అంత్యక్రియలతో నేపాల్‌లో హృదయవిదారక పరిస్థితులు నెలకొన్నాయి. బాధిత ప్రాంతాల కోసం నేపాల్ ప్రభుత్వం అత్యవసర నగదు సహాయాన్ని విడుదల చేసింది. ఇందులో భాగంగా రసువా, నువాకోట్ జిల్లాలకు చెరో 10 మిలియన్ల నేపాలీ రూపాయలు, ధాడింగ్‌కు రూ.5 మిలియన్లు, 15 స్థానిక ప్రభుత్వాలకు కలిపి రూ.67.5 మిలియన్ల చొప్పున కేటాయించింది.

ఆగస్టు 26న నేపాల్-చైనా సరిహద్దుల్లో విరుచుకుపడిన ఆకస్మిక వరద పెను విషాదాన్ని మిగిల్చింది. మరోవైపు టిబెట్‌లోని క్యిరాంగ్ కౌంటీలో 16 మంది మరణించగా 546మంది జాడ గల్లంతైంది. లాంగ్‌టాంగ్ నేషనల్ పార్క్‌లోని హిమానీనదం విరిగి లోయలో పడడం వల్ల 5.2 తీవ్రతతో సంభవించే భూకంపానికి సమానమైన శక్తి ఉత్పన్నమైందని అమెరికా జియోలాజికల్ సర్వే తెలిపింది. ఇదే ఆకస్మిక వరదలకు కారణమైందని పేర్కొంది.

దాదాపు 100 కిలోమీటర్ల మేర రాళ్లు, బురదతో కూడిన వరద ముంచెత్తిందని పేర్కొంది.

**సొరంగంలో చిక్కుకున్న కార్మికులు**

ఆకస్మిక వరదల ధాటికి రసువాలోని అప్పర్ త్రిశూలీ హైడ్రోపవర్ ప్రాజెక్ట్ టన్నెల్ బురదతో నిండిపోవడంతో, 100 మందికి పైగా కార్మికులు చిక్కుకున్నట్లు అధికారులు భావిస్తున్నారు. టన్నెల్ రెస్క్యూ ఆపరేషన్, సర్వైవర్ డిటెక్షన్, డీఎన్ఏ పరీక్షల కోసం నేపాల్ చేసిన విజ్ఞప్తి మేరకు భారత్ ప్రత్యేక నిపుణుల బృందాన్ని పంపించింది. అంతేకాదు ఆహారం, మందులు, దుప్పట్లు, రహదారుల పునరుద్ధరణకు ప్రీ-ఫ్యాబ్రికేటెడ్ బ్రిడ్జిలను అందజేసింది. వాతావరణం కాస్త అనుకూలించడంతో నేపాల్ సైన్యం, భారత రెస్క్యూ బృందాలు గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. చైనా కూడా నిపుణులను రెస్క్యూ ఆపరేషన్‌కు పంపింది. శిథిలాల కింద లభ్యమవుతున్న మృతదేహాలు గుర్తు పట్టలేనంతగా పాడవడంతో, అంటువ్యాధులు ప్రబలకుండా అధికారులు డీఎన్ఏ నమూనాలు సేకరించి, ఆరుబయట సామూహికంగా ఖననం చేస్తున్నారు. కాగా టిబెట్‌లో వరద కారణంగా ఏర్పడిన బారియర్ సరస్సు ముప్పు తగ్గినట్లు చైనా నిపుణులు చెప్పడం పెద్ద ఉపశమనం కలిగించింది. ఆ సరస్సులోని నీటిమట్టం క్రమంగా తగ్గుతోందని స్పష్టమైనప్పటికీ, ఆ నీరు పూర్తిగా దిగువకు చేరేవరకు ప్రమాదం పొంచే ఉంటుందని అధికారులు హెచ్చరిస్తున్నారు. దేశాన్ని మళ్లీ గాడిలో పెట్టేందుకు దాదాపు 5 బిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో సుమారు రూ.40 వేల కోట్లు అవసరమవుతాయని నేపాల్ ప్రభుత్వం అంచనా వేసింది.

# ప్రశాంతంగా నీట్ పీజీ పరీక్ష

మొదటి పేజీ తరువాయి...

మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. తమిళనాడు, ఢిల్లీ, ఉత్తర్ ప్రదేశ్ సహా పలు నగరాల్లోని విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఉన్నత వైద్య కోర్సుల్లో ప్రవేశాలు పొందడం కోసం ఈ పరీక్షను నిర్వహిస్తారు.

**రాజస్థాన్‌లో పరీక్షకు విద్యుత్ అంతరాయం**

సాంకేతిక సమస్యల కారణంగా పరీక్షకు అంతరాయం కలిగిందని ఆరోపిస్తూ, సీతాపురలోని ఒక పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థులు నిరసన వ్యక్తం చేశారు. "నేను పరీక్ష రాయడానికి ఇక్కడికి వచ్చాను. పరీక్ష మొదలవ్వకముందే సిస్టమ్ పదేపదే ఆగిపోతూ వచ్చింది. రెండు నిమిషాలు పనిచేసి, ఆ తర్వాత ఆగిపోయింది. ఇలా కనీసం 20 సార్లు జరిగింది. కొద్ది సేపటికి పనిచేస్తుందేమోనని అనుకున్నాం. కానీ అది పనిచేయలేదు" అని విష్ణు శర్మ అనే అభ్యర్థి ఆందోళన వ్యక్తం చేశారు.

తమ వద్ద భారీ మొత్తంలో డబ్బు వసూలు చేస్తున్నప్పుడు, దేశంలోనే అతిపెద్ద పరీక్షల్లో ఒకటైన దీనికి సరైన సదుపాయాలను కల్పించలేరా? అని అభ్యర్థులు ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీనికి బాధ్యత వహించడానికి ఎవరూ సిద్ధంగా లేరని, పరీక్షను కేవలం తమ కేంద్రంలోనే మళ్లీ నిర్వహించడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిని రద్దు చేసి దేశవ్యాప్తంగా మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

**'విద్యార్థులకు నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నాం'**

మరోవైపు, ఈ ఘటనపై పోలీసు అధికారి లలిత్ శర్మ స్పందించారు. "సర్వర్ సరిగ్గా పనిచేయకపోవడం వల్లే పరీక్ష సజావుగా సాగలేదని తెలుస్తోంది. కొందరి కంప్యూటర్లు పనిచేయగా మరికొందరివి పనిచేయకపోవడంతో పరీక్షకు అంతరాయం కలిగింది. పరీక్ష, నిర్వహణ తీరుపై విద్యార్థులు ఆగ్రహంతో ఉన్నారు. ప్రస్తుతం వారితో చర్చిస్తూ, నచ్చజెప్పే ప్రయత్నం చేస్తున్నాం. ఈ విషయం గురించి పరీక్ష నిర్వహణ సంస్థతో ఉన్నతాధికార స్థాయిలో చర్చలు కూడా జరుగుతున్నాయి" అని తెలిపారు.

**నీట్ యూజీ పేపర్‌లీక్ వివాదం**

ఇదిలా ఉండగా, 'నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ' (ఎన్‌టీఏ) మే 3న పెన్-అండ్-పేపర్ విధానంలో నిర్వహించిన నీట్ యూజీ 2026, పేపర్ లీక్ ఆరోపణల నేపథ్యంలో రద్దు చేశారు. అనంతరం, జూన్ 21న రీ టెస్ట్ నిర్వహించారు. అయితే పరీక్షల్లో అవకతవకలు జరిగాయని, ఫలితంగా కొంత మంది విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారని విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. అందుకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) ఆధ్వర్యంలో ఢిల్లీ నిరసన ప్రదర్శన చేపట్టారు. దీంతో ప్రభుత్వం దిగివచ్చింది. ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. నూతన విద్యాశాఖ మంత్రిగా ప్రహ్లాద్ జోషిని నియమించారు. పరీక్షల్లో సంస్కరణలు తీసుకొస్తామని ప్రభుత్వం పేర్కొంది. పేపర్‌లీక్‌లో బాధ్యులను కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చింది.

# ప్రధాని మోడీకి ఉజ్బెకిస్థాన్ అత్యున్నత పురస్కారం

మొదటి పేజీ తరువాయి...

స్థాయికి పెంచడం ఎంతో సంతోషంగా ఉందని వెల్లడించారు. ఉజ్బెకిస్థాన్ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ ఆహ్వానం మేరకు మోదీ రెండు రోజుల పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి ఉజ్బెకిస్థాన్ అత్యున్నత పురస్కారాన్ని అందజేసింది. అంతకుముందు ఉజ్బెకిస్తాన్ అధ్యక్షుడితో ప్రధాని మోదీ ప్రతినిధుల స్థాయి చర్చలు జరిపారు. వాణిజ్యం, పెట్టుబడులు, డిజిటల్ కనెక్టివిటీ, రక్షణ, ఇంధన రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత విస్తరించుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. 'వికసిత్ భారత్', 'యాంగీ ఉజ్బెకిస్థాన్' అనే ఉమ్మడి అభివృద్ధి లక్ష్యాల సాధన దిశగా భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకుంటామని ఇరు దేశాధినేతలు ప్రకటించారు. "ఈ అత్యున్నత పురస్కారాన్ని నేను ఎంతో వినమ్రతతో స్వీకరిస్తున్నాను. ఇరు దేశాల మధ్య ఉన్న శతాబ్దాల నాటి ప్రాచీన స్నేహానికి, మన ఉమ్మడి వారసత్వానికి దీనిని వినమ్ర పూర్వకంగా అంకితం చేస్తున్నాను. మీ దూరదృష్టి గల నాయకత్వం, భారతదేశం పట్ల మీకున్న స్నేహభావం కారణంగా మన ద్వైపాక్షిక సంబంధాలు నిరంతరం బలోపేతం అవుతూ వచ్చాయి. ప్రతి క్షణం అవి సరికొత్త శిఖరాల దిశగా విజయవంతంగా దూసుకెళ్తున్నాయి. దీని ఫలితంగానే, నేడు మన సంబంధాలకు సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం అనే సరికొత్త స్థాయి లభించింది. అవార్డు ద్వారా గౌరవ ప్రతిష్టలు దక్కుతాయన్నది నిజమే, కానీ ఒక అవార్డు తనతో పాటు ఒక మహత్తరమైన బాధ్యతను కూడా మోసుకొస్తుందని నాకు బాగా తెలుసు. ఈ రోజు నేను ఈ అవార్డును స్వీకరిస్తున్న వేళ, ఆ బాధ్యతను మనస్ఫూర్తిగా గుర్తిస్తున్నాను. ఉజ్బెకిస్థాన్ చారిత్రక గడ్డ పైనుంచి నేను అక్కడి ప్రజలకు ఒక నమ్మకాన్ని ఇవ్వాలనుకుంటున్నాను. భారతదేశం ఎన్నటికీ తన బాధ్యతల నుంచి వెనకడుగు వేయదు, ఈ స్నేహాన్ని చిత్తశుద్ధితో నిలబెట్టుకుంటుందిమరో 2 రోజుల్లో ఉజ్బెకిస్థాన్ 35వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకోనున్న సందర్భంగా ఆ దేశ ప్రజలకు మోదీ ముందస్తుగా శుభాకాంక్షలు తెలిపారు. భారత్- ఉజ్బెకిస్థాన్ వ్యూహాత్మక భాగస్వామ్యానికి 15 ఏళ్లు పూర్తవుతున్న శుభ సందర్భంలో, ఇరు దేశాల సంబంధాలను సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి పెంచడం ఎంతో సంతోషంగా ఉందని పేర్కొన్నారు. నిర్దిష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకుని ఇరు దేశాలు కలిసి ముందుకు సాగుతాయని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఉజ్బెకిస్థాన్ రాజధాని తాష్కెంట్‌లో 'యోగా ఫెడరేషన్ ఆఫ్ ఉజ్బెకిస్థాన్' ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా సెషన్‌లో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఉజ్బెకిస్థాన్‌లో యోగాకు విశేష ఆదరణ ఉందని, ఇది రెండు దేశాల ప్రజలు, సంస్కృతులను ఏకం చేస్తోందని విదేశీ వ్యవహారాల శాఖ పేర్కొంది. అంతకుముందు నాలుగు రోజుల విదేశీ పర్యటనలో భాగంగా ఉజ్బెకిస్థాన్ వెళ్లిన ప్రధాని మోదీకి తాష్కెంట్ విమానాశ్రయంలో ఆ దేశ అధ్యక్షుడు షవ్కత్ మిర్జియోయెవ్ స్వాగతం పలికారు. పర్యటనలో భాగంగా యాంగి ఉజ్బెకిస్థాన్ పార్కును సందర్శించిన ప్రధాని, అక్కడి స్వాతంత్ర్య స్మారక స్థూపం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం ప్రవాస భారతీయులతో మోదీ సమావేశమయ్యారు. ప్రవాసులు అందించిన ఆప్యాయత తనను ఎంతగానో ఆకట్టుకుందని ప్రధాని మోదీ సామాజిక మాధ్యమాల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రవాసులు ప్రదర్శించిన కథక్, అండిజాన్ పోల్కా నృత్యాలను ఆయన ఆసక్తిగా తిలకించారు. ఉజ్బెకిస్థాన్‌లోని అధికారిక కార్యక్రమాల అనంతరం మోదీ కిర్గిజిస్థాన్ చేరుకుంటారు. బిష్కెక్ నగరంలో జరగనున్న షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సమావేశంలో పాల్గొంటారు.




# రాష్ట్రంలో 42 రైల్వే స్టేషన్‌ల అభివృద్ధి

మొదటి పేజీ తరువాయి...

పనులు చేపట్టినట్టు తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం క్యాంటీన్, ఎస్కలేటర్, 2 లిఫ్టులు, దివ్యాంగులకు ఆధునిక వసతులు కల్పించడం జరుగుతుందని వివరించారు. ఈ సంవత్సరం చివరి నాటికి వికారాబాద్ రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు పూర్తి చేయడం జరుగుతుందని వెల్లడించారు. వికారాబాద్ ప్రాంత అభివృద్ధికి రైల్వే కనెక్టివిటీ ఎంతో కీలకమని, ఆధునికీకరణ పనులు పూర్తైన తరువాత ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందుతాయని స్పష్టం చేశారు. చేవెళ్లలో హైదరాబాద్ బీజాపూర్ రహదారి రోడ్డు పనులను పరిశీలించిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, రోడ్డు పనుల్లో ఆలస్యం ఎందుకు జరుగుతుందని అధికారులను ప్రశ్నించారు. రోడ్డు వంకర టింకర్లు ఉండడంతో భూసేకరణ సమయంలో పరిశీలించలేదా అని అధికారులను ప్రశ్నించారు. రోడ్డు మలుపులు ఎక్కువగా ఉండడంతో ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుకు ఇరువైపులా హెచ్చుగా ఉండటంతో ఒకవైపు సర్వీస్ రావడం, మరోవైపు రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని వారి దృష్టికి తీసుకెళ్లారు. అధికారులు తడబడడంతో హైదరాబాద్ బీజాపూర్ రోజువారి పనుల విషయంలో సమీక్షా సమావేశం నిర్వహించి రైతులు, స్థానికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే కాల యాదయ్య, మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, మున్సిపల్ ఛైర్ పర్సన్ దేవర సమత, వెంకట్ రెడ్డి, కౌన్సిలర్లు మనీషా అనంత్ రెడ్డి, శైలజా రెడ్డి తదితరులు ఉన్నారు.

# మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఫిక్స్

మొదటి పేజీ తరువాయి...

చూస్తే మంత్రివర్గ విస్తరణతో పాటు ప్రక్షాళన ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

ప్రస్తుత మంత్రుల శాఖల్లోనూ పెద్ద ఎత్తున మార్పులు చేర్పులు చోటుచేసుకునే అవకాశం కనిపిస్తోంది. దాదాపు మంత్రుల అందరి శాఖలను మార్చే పనిలో సీఎం ఉన్నట్లు పీసీసీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇప్పటికే 80 శాతానికి పైగా పూర్తయిన పనులను వేగంగా పూర్తి చేయడంతో పాటు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించేందుకు కొందరు మంత్రులు అధికారులకు ఆదేశాలు ఇస్తున్నట్టు తెలుస్తోంది.

అధిష్ఠానం ఏ నిర్ణయం తీసుకుంటుందోననే ఉత్కంఠ : ప్రస్తుత కేబినెట్‌లో ఒకరిద్దరు మంత్రులకు ఉద్వాసన పలికే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. కొండా సురేఖ కుమార్తె కొండా సుస్మిత పటేల్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఆమెపై అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందా అనే ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం మంత్రివర్గంలో రెండు బెర్తులు ఖాళీగా ఉండగా, ఒకరిద్దరు మంత్రులను తప్పిస్తే మరో రెండు స్థానాలు ఖాళీ అయ్యే అవకాశం ఉంది. దీంతో మొత్తం మూడు నుంచి నాలుగు బెర్తులు అందుబాటులోకి వస్తే ఉమ్మడి జిల్లా, సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యం ఇస్తూ కొత్త వారికి అవకాశం కల్పించే ఆలోచనలో ముఖ్యమంత్రి ఉన్నట్లు తెలుస్తోంది. ఈ జిల్లాల వారికి ఈసారి అవకాశం : ప్రస్తుతం మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేని ఉమ్మడి రంగారెడ్డి, నిజామాబాద్ జిల్లాలకు ఈసారి అవకాశం కల్పించే విషయం పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. స్పీకర్ గడ్డం ప్రసాద్ మంత్రి పదవిపై ఆసక్తి చూపుతుండడంతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా కోటాలో కేబినెట్‌లోకి తీసుకుని, స్పీకర్ పదవిని మరో నేతకు అప్పగిస్తే ఎలా ఉంటుందనే అంశంపై కూడా సీఎం ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలనే ఆలోచనలో ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే ఏఐసీసీ స్థాయిలో రాజగోపాల్ రెడ్డి పేరు ప్రతిపాదనకు వస్తే సమీకరణాలు మారే అవకాశం ఉందంటున్నారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ నేతృత్వంలో ఎన్నికలకు వెళతామని సీఎం పదే పదే చెబుతున్నారు. దీంతో ఆయనకు మంత్రి మండలిలో స్థానం లేదని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ పేరును పరిశీలించే అవకాశం కూడా ఉందని ప్రచారం జరుగుతోంది. గవర్నర్ కోటాలో 3 స్థానాలు ఖాళీ : ఈ ఏడాది నవంబర్ గవర్నర్ కోటాలో 3 ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానున్నాయి. పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన ఈరవత్రి అనిల్‌ను ముందుగానే కేబినెట్‌లోకి తీసుకుని, ఆ తర్వాత గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా అవకాశం కల్పించే అంశాన్ని కూడా సీఎం పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. మరోవైపు కొండా సురేఖపై చర్యలు తీసుకుంటే ప్రస్తుత ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు మంత్రి పదవి దక్కే అవకాశాలు ఉన్నట్లు పార్టీ నేతల్లో చర్చ నడుస్తోంది. స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను మంత్రి మండలిలోకి తీసుకునేట్లు అయితే స్పీకర్ కుర్చీ ఖాళీ కానుంది. ఆ స్థానాన్ని దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్‌కు అప్పగించే అవకాశం ఉందని తెలుస్తోంది. అంటే కేబినెట్ విస్తరణతో పాటు స్పీకర్ మార్పు, మంత్రుల శాఖల మార్పు, ఒకరిద్దరు మంత్రుల తొలగింపు, కొత్త వారికి అవకాశం ఇలా భారీ స్థాయిలో మార్పులు చేర్పులకు సీఎం రేవంత్‌రెడ్డి కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది.

# హైదరాబాద్‌లో రూ.183 కోట్ల భారీ జీఎస్టీ స్కామ్

**హైదరాబాద్, ఆగస్టు 30 (ప్రభాత ఉదయం)**


హైదరాబాద్‌లో భారీ సైబర్ మోసం ఒకటి వెలుగులోకి వచ్చింది. ఓ వ్యాపార సంస్థకు చెందిన జీఎస్టీ ఖాతాను హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు, ఏకంగా రూ.183.61 కోట్ల విలువైన నకిలీ ఇన్వాయిస్‌లు సృష్టించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేందుకు ప్రయత్నించారు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదుతో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేసింది. ఈ మోసం వెనుక వ్యవస్థీకృత ముఠా హస్తం ఉండవచ్చని అధికారులు అనుమానిస్తున్నారు. నల్లగొండ జిల్లా చిట్యాలకు చెందిన నిఖిల్ రెడ్డి, అనంతరెడ్డి అనే సోదరులు హయత్‌నగర్‌లో 'యుక్తా ప్లైవుడ్ అండ్ హార్డ్‌వేర్' పేరుతో వ్యాపారం చేస్తున్నారు. ఆగస్టు 3న ఆ సంస్థ అకౌంటెంట్, జీఎస్టీ పోర్టల్‌లో లాగిన్ అయ్యేందుకు ప్రయత్నించగా సాధ్యపడలేదు. లాగిన్ వివరాలు (క్రెడెన్షియల్స్) తప్పుగా ఉన్నాయని సందేశం వచ్చింది. అనుమానంతో పరిశీలించగా, జులై 23వ తేదీనే గుర్తుతెలియని వ్యక్తులు తమ కంపెనీ జీఎస్టీ ఖాతాకు లింక్ అయిన మొబైల్ నంబర్, ఈ-మెయిల్ ఐడీని మార్చేసినట్లు గుర్తించారు. వెంటనే ఈ విషయాన్ని యజమానులకు తెలియజేశారు.

# బీరప్పస్వామి ఆలయంలో వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన

**కురుమల ఆరాధ్యదైవం బీరప్పస్వామి**

**ఆలయానికి డోలు,తాళాలు బహూకరించిన కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు,మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్**

**రాజేంద్రనగర్,ఆగస్టు30(ప్రభాత ఉదయం)**



నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన బీరప్పస్వామి ఆలయంలో ఆదివారం బీరప్పస్వామి,సతీసమేత కామారతి దేవి విగ్రహాల ప్రాణప్రతిష్ఠతో పాటు ధ్వజస్తంభ స్థాపన మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బీరప్పస్వామి,కామారతి దేవి కల్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. హైదరాబాద్--పాలమూరు కురువ సంఘం జంటనగరాల అధ్యక్షుడు,రాజేంద్రనగర్ నియోజకవర్గం కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు,మాజీ కౌన్సిలర్ ఎస్.వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై స్వామివారి విగ్రహాలను దర్శించుకుని ప్రత్యేక పూజలునిర్వహించారు.సుమారు రూ.3.5 కోట్ల వ్యయంతో నిర్మించిన ఆలయంలో జరిగిన ప్రతిష్ఠాపన కార్యక్రమంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు.అనంతరం వేద పండితులు వెంకటేష్‌కు ఆశీర్వచనాలు అందించగా,కురుమ సంఘ నాయకులు,కులస్తులు శాలువాతో ఘనంగా సత్కరించారు.

**కురుమల ఆరాధ్యదైవం బీరప్ప స్వామి**

ఈ సందర్భంగా ఎస్.వెంకటేష్ మాట్లాడుతూ..ఎంతో భక్తిశ్రద్ధలతో సుందరంగా బీరప్పస్వామి ఆలయాన్ని నిర్మించుకోవడం అభినందనీయమన్నారు.కురుమ కులస్తులందరికీ విగ్రహ ప్రతిష్ఠాపన శుభాకాంక్షలు తెలిపారు.పురాతన కాలం నుంచి బీరప్ప స్వామి పండుగకు ఎంతో విశిష్టత ఉందని పేర్కొన్నారు.స్వామివారి ఆశీస్సులతో,కురుమ సోదరుల అభిమానంతో ఈ కార్యక్రమానికి హాజరుకావడం ఆనందంగా ఉందన్నారు.బీరప్ప స్వామి,కాటమరాజు ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

**ఆలయానికి డోలు,తాళాలు బహూకరణ...**

హైదరాబాద్--పాలమూరు జిల్లా కురువ సంఘం ఆధ్వర్యంలో ఆలయానికి డోలు,తాళాలను బహూకరించినట్లు ఎస్.వెంకటేష్ తెలిపారు.ఆలయ ఆధ్యాత్మిక కార్యక్రమాలు,ఉత్సవాల్లో డోలు,తాళాల వినియోగం ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటుందని అన్నారు.కురుమ సమాజం ఐక్యత,సాంస్కృతిక సంప్రదాయాలను కొనసాగించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు.

**భక్తులతో మారుమోగిన ఆలయ పరిసరాలు..**

ప్రాణప్రతిష్ఠ,కల్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి.మేళతాళాలు,శివసత్తుల పూనకాలు,భక్తుల జయజయధ్వనులతో ధన్వాడలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు పరిసర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.ఈ కార్యక్రమంలో హైదరాబాద్--పాలమూరు కురువ సంఘం వ్యవస్థాపకుడు కొల్లంపల్లి శ్రీనివాస్,ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు మందారం కృష్ణ,స్థానిక నాయకులు జాత్రం శ్రీనివాస్ కుర్వ,అప్ప శ్రీను కుర్వ,పూజారి శ్రీను కుర్వ,కేవీ రాజు కుర్వ,రిషి కుర్వ,వన్నడే రమేష్ కూర్మ,ప్రొఫెసర్ గురునాథ్ కుర్వ,తెల్లప్ప కూర్మతో పాటు భారీ సంఖ్యలో కురుమ కులస్తులు,భక్తులు పాల్గొన్నారు.



గాయాల పాలైన కార్మికుడిని పరామర్శించిన జైపాల్ రెడ్డి

## కార్మికులు విధినిర్వాణలో ప్రమాదానికి గురైతే పట్టించుకోరా

**తెలంగాణ మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ వనంపల్లి జైపాల్ రెడ్డి**

**రాజేంద్రనగర్, ఆగస్టు30 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ మున్సిపల్ స్టాఫ్, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ వనంపల్లి జైపాల్ రెడ్డి రంగారెడ్డి జిల్లా మున్సిపల్ సంఘం అధ్యక్షులు టి.ఆనంద్ తో కలిసి ఆదివారం శివరాంపల్లి లో నివాసముంటున్న పారిశుధ్య కార్మికుడు ఎస్ రామచంద్రయ్య ని పరామర్శించారు. ఈ సందర్భంగా వనంపల్లి జైపాల్ రెడ్డి మాట్లాడుతూ అత్తాపూర్ సర్కిల్ మైలార్ దేవ్ పల్లి డివిజన్ గగన్ పాడ్ ప్రాంతంలో రోజు మాదిరిగా శుక్రవారం(ఈనెల 28వ తేదీన) ఉదయం 7 గంటలకు పారిశుధ్య విధులు నిర్వహిస్తున్న ఎస్.రామచంద్రయ్య, వయసు 55 సంవత్సరాలు గగన్ పాడ్, శాతంరాయి మధ్య సర్వీస్ రోడ్డులో చెత్త కుప్పలు ఎత్తుతున్న సమయంలో బైక్ యాక్సిడెంట్ కావడంతో కార్మికునికి రెండు మోకాళ్ళకు నడుములకు బలమైన గాయాలు తగలడం జరిగింది. అధికారులు పారిశుధ్య కార్మికులచే విధులు పర్యవేక్షణ చేస్తున్నటువంటి మైలార్ దేవ్ పల్లి ప్రాంతంలో శానిటేషన్ సూపర్వైజర్ (రూ) కు కార్మికులని పనిచేయాలని ఒత్తిడి చేయడమే తప్ప కార్మికులకు ప్రమాదాలు జరిగిన నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నాడు. వీళ్లకు కార్మికులు ప్రమాదాలకు గురైన సరే ప్రతిరోజు విధులు నిర్వహించాలని కార్మికులపై ప్రతిరోజు ఒత్తిడి చేయడమే తప్ప కార్మికుల ఆరోగ్యాలు ఏ విధంగా ఉన్నాయని ఏ ఒక్కరిని కూడా పలకరించరు. అధికారులు ఇప్పటికైనా ప్రమాదాలు జరిగిన సమయంలో స్పందించి కార్మికులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలి. మూడు రోజులైనా కార్మికునికి రెండు మోకాళ్ళకు ప్రమాదం జరిగిన ఏ ఒక్క అధికారి కూడా పలకరించిన పాపాన పోలేదు ఇప్పటికైనా కార్మికుడు అంటే నిర్లక్ష్య ధోరణి వదలాలని ఆయన హెచ్చరించారు.



లక్ష్మీ నగర్ పార్కులో జరిగిన ఉచిత వైద్య శిబిరం లో పాల్గొన్న నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ ధర్మ రక్షక్

## స్వచ్ఛంద సంస్థలు ఉచిత వైద్య శిభిరాలను నిర్వహించాలి - ప్రజలను జాగృత పరచాలి

**నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ ధర్మ రక్షక్**

**బుద్వేల్, ఆగస్టు 30 (ప్రభాత ఉదయం)**

అత్తాపూర్ లక్ష్మీనగర్ వాకర్స్ అసోసియేషన్, ఎండో ఎఫెక్ట్స్ సూపర్ స్పెషాలిటీ క్లినిక్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం అత్తాపూర్ లక్ష్మీనగర్ పార్కులో నిర్వహించిన మెగా హెల్త్ క్యాంపు లో స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ ఉచిత వైద్య శిభిరంలో బీపీ, షుగర్, థైరాయిడ్, కంటి పరీక్షలతో పాటు పలు రకాల వైద్య సేవలను ఉచితంగా అం దజేశారు. లక్ష్మీనగర్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మీ మహేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం లో నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ ధర్మరక్షక్, ఎండో ఎఫెక్ట్స్ సూపర్ స్పెషాలిటీ క్లినిక్ ఎండీ డాక్టర్ డీఎం వీచిక అన్నపురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మజ్లిస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జిగా ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్

**బుద్వేల్, ఆగస్టు 30 (ప్రభాత ఉదయం):**



మజ్లిస్ పార్టీ రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జిగా బహదూర్ పుర ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ నియమితులైనారు. ఈ మేరకు ఆదివారం ఆయనను పార్టీ అధ్యక్షులు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జిగా నియమిస్తు ప్రకటన చేశారు. ఈ సందర్భంగా మహ్మద్ ముబీన్ మాట్లాడుతూ, రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మజ్లిస్ పార్టీ బలోపేతానికి తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు.



## స్వచ్ఛంద సంస్థలు వైద్య శిబిరాలను నిర్వహించాలి

**జాగృత పరచాలి.. నిమ్స్ మాజీ డైరెక్టర్ ధర్మ రక్షక్**

**ఉచిత మెగా వైద్య శిబిరం...**

**రాజేంద్రనగర్, ఆగస్టు 30(ప్రభాత ఉదయం)**

అత్తాపూర్ లక్ష్మీ నగర్ పార్క్ వాకర్స్ అసోసియేషన్, ఎండో ఎఫెక్ట్స్ సూపర్ స్పెషాలిటీ క్లినిక్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం నిర్వహించిన మెగా హెల్త్ క్యాంపులో స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ ఉచిత వైద్య శిబిరంలో బీపీ, షుగర్, థైరాయిడ్, కంటి పరీక్షలతో పాటు పలు రకాల వైద్య సేవలను ఉచితంగా అందించారు. లక్ష్మీ నగర్ పార్క్ వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మి మహేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నిమ్స్ మాజీ డైరెక్టర్ ధర్మ రక్షక్, ఎండో ఎఫిక్స్ సూపర్ స్పెషాలిటీ క్లినిక్ ఎండీ, డి ఎం వీచిక అన్నపు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





మహావీర్ ఇంజనీరింగ్ కళాశాల వద్ద నీట్ పీజీ అర్హత పరీక్ష రాయడానికి వచ్చిన విద్యార్థులు

## మహావీర్ ఇంజనీరింగ్ కళాశాలలో నీట్ పీజీ అర్హత పరీక్షలు రాసిన 430 మంది విద్యార్థులు

**బుద్వేల్, ఆగస్టు 30 (ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ నియోజకవర్గం పల్లెచెరువు సమీపంలో గల మహావీర్ ఇంజనీరింగ్ కళాశాల లో ఆదివారం జరిగిన నీట్ పీజీ అర్హత పరీక్ష లో 430 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈ కేంద్రంలో మొత్తం 440 మంది విద్యార్థులు పరీక్ష రాయనుండగా పది మంది విద్యార్థులు గౌరాహాజరు అయ్యారు. ఉదయం ఏడు గంటల నుంచే విద్యార్థులను పరీక్షా కేంద్రం లోకి అనుమతిచ్చారు. 8:30 గంటలకు పరీక్షా కేంద్రం గేట్లు మూసివేశారు. విద్యార్థులు సమయానికంటే ముందే పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. పరీక్షా కేంద్రం వద్ద మైలార్దేవుపల్లి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



గాయపడ్డ రామచంద్రయ్య ను పరమార్శిస్తున్న కార్మిక నాయకులు వనంపల్లి జైపాల్ రెడ్డి

## రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ పారిశుధ్య కార్మికుడు

**బుద్వేల్, ఆగస్టు 30 (ప్రభాత ఉదయం)**

పారిశుధ్య పనులు చేస్తున్న సమయంలో ద్విచక్ర వాహనం ఢీ కొని రెండు కాళ్లకు గాయాలైన శివరాంపల్లి కి చెందిన ఎస్ రాంచంద్రయ్య ను ఆదివారం తెలంగాణ మ ఎన్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు టి ఆనంద్ లు పరమార్శించారు. రాంచంద్రయ్య ను అధికారులు పరమార్శించి ఆయన కు మెరుగైన వైద్యం చేయిం చాలని కోరారు.

## హైదర్‌గూడలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

**బుద్వేల్, ఆగస్టు 30 (ప్రభాత ఉదయం)**



గుర్తు తెలియని వ్యక్తి మృత దేహం

హైదర్ గూడ కుల్దీప్ వైన్స్ సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి పడి మరణించాడు. సమాచారం అందుకున్న రాజేంద్రనగర్ పోలీస్ కానిస్టేబుల్ ప్రేమ్ కుమార్, హోంగార్డు విజయ్లు సంఘటన స్థలానికి వెళ్లి అపస్మారక స్థితిలో పడి ఉన్న వ్యక్తిని చికిత్స నిమిత్తం 108 కి కాల్ చేయగా వారు వచ్చి చూసి అప్పటికే మరణించాడని తెలిపారు. మరణించిన వ్యక్తి వయస్సు 50 సంవత్సరాలు ఉంటుందని, బ్లాక్ పాయింట్, వైట్ షర్ట్ ధరించి ఉన్నాడని తెలిపారు. కేసు నమోదు చేసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# బుద్వేల్ పంప్ హౌస్ స్థలం బస్తీ కోసమే ఉపయోగించాలి

**పోలీస్ స్టేషన్ చేరిన బుద్వేల్ పంప్ హౌజ్ స్థల వివాదం**

**బుద్వేల్, ఆగస్టు 30 (ప్రభాత ఉదయం)**




బుద్వేల్ కోట మైసమ్మ దేవాలయం వద్ద ఉన్న పంప్ హౌస్ వద్ద స్థానిక ప్రజలు



ఎం హరి యాదవ్



కోరని సదానంద్

రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ లో పంప్ హౌజ్ ఉన్న 77 గజాల స్థల వివాదం ఆదివారం పోలీస్ స్టేషన్ కు చేరుకుంది. ఆ స్థలం బస్తీకి చెందిందే అని బస్తీ వాసులు వంద మందికి పైగా అక్కడికి చేరుకుని కమ్యూనిటీ హాల్ లేదా లైబ్రెరీ కోసం నిర్మాణం చేద్దామని బేస్మెట్ తీస్తుండగా, స్థల పట్టదారు వారసుడు అన్వర్ రాజేంద్రనగర్ పోలీసులను ఆశ్రయిం చాడు. దీంతో సమస్య పోలీస్ స్టేషన్ కు చేరుకుంది. బుద్వేల్ బస్తీ లో శాంతిభద్రతల సమస్యకు దారి తీసే ఈ వివాధాన్ని అధికారులు సమన్వయంతో పరిష్కారించాల్సిన అవసరం ఉందని బస్తీ పెద్దలు, స్థానికులు కోరుతున్నారు. వివరాలు ఈ విదంగా ఉన్నాయి. 1987లో బుద్వేల్ కోట మైసమ్మ దేవాలయం సమీపంలో 77 గజాలలో నిర్మించిన పంప్ హౌజ్ ప్రస్తుతం నిరుపయోగంగా ఉంది. అది ఇళ్ల మధ్యలో ఉంది. ఆ స్థలం మాదేనని పట్టాదారు ఎండీ హయాత్ వారసుడు అన్వర్ 2026 మార్చి 7న రాజేంద్రనగర్ కు చెందిన కె వేణుగోపాల్ గౌడ్ కు విక్రయించాడు. స్థలాన్ని కొనుగోలు చేసిన వేణుగోపాల్ గౌడ్ మూడు రోజుల క్రితం ఎస్కవలేటరు తో పంప్ హౌజ్ ను కూల్చడానికి వచ్చి సగం గదిని కూల్చగా, అక్కడున్న కాలనీ వాసులు అడ్డుకున్నారు. ఇది బస్తీకి చెందిన స్థలం అని కూల్చకూడదని అడ్డు చెప్పడంతో వేణుగో పాల్ గౌడ్ అక్కడి నుంచి వెళ్లి పోయారు.

**ఆదివారం పంప్ హౌజ్ వద్దకు చేరుకున్న బస్తీ వాసులు :**

బస్తీకి చెందిన పంప్ హౌజ్ ను ప్రైవేటు వ్యక్తులు ఎలా తీసుకుంటారని, ఆ స్థలం పట్టాదారులకు ఎలాం టి సంబందం లేదని బస్తీ కి చెందిన 100 మంది ప్రజలు పంప్ హౌజ్ వద్దకు చేరుకున్నారు. ఆ స్థలం లో బస్తీకి ఉపయోగపడే ఏదైన భవనం నిర్మిద్దాం అంటు బేస్మెట్ తీయడానికి ఎస్కలేటరు ను రప్పించి పనులు ప్రారంభించారు. పంప్ హౌజ్ ఉన్న స్థలం ప్రభుత్వానిదేనని అది బస్తీ కోసమే ఉపయోగిం చాలని స్థానిక నాయకులు కోరని బాల్ రాజ్, కోరని సదానంద్, ఎం హరి యాదవ్ లు అన్నారు. దానికి అక్కడున్న వంద మంది ప్రజలు కూడా మద్దతు పలికారు. ఆ స్థలంలో లేఔట్ చేసిన వ్యక్తి పంప్ హౌజ్ కోసం స్థలాన్ని వదిలి లే ఔట్ చేశారని గుర్తు చేశారు. బస్తీ మధ్యలో ఉన్న ఆ స్థలాన్ని స్థానికంగా ఏదైన భవనం నిర్మాణానికే ఉపయోగించాలని, ఈ విషయంలో తాము ఎక్కడికి రమ్మన్న వస్తామని తెలిపారు. అంతలోనే పట్టాదారు వారసులమని చెబుతున్న అన్వర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పనులను ఆపివేశారు. పంప్ హౌజ్ వద్దకు చేరుకుని ఆ స్థలం బస్తీదేనని అన్న వారిలో బస్తీ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు ఉన్నారు.

**మా స్వంత స్థలం అధి పట్టాదారు వారసులు అన్వర్ :**

బుద్వేల్ సర్వే నెంబర్ 211/1/ఎఎ లోని 8.9 ఎకరాలు మా కుటుంబానికి చెందిందని అన్వర్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. బుద్వేల్ లో ఉన్న తమ భూమిని 1964 లో వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పడినప్పుడు ప్రభుత్వం తీసుకుందన్నారు. తిరిగి తాము పోరాడితే 1989 లో 4.3 ఎకరాలను తమకు ఇచ్చిందని, అందుకు సంబందించిన ప్రొసిడింగ్స్ నెంబరు డీ/ఆర్ ఓ ఆర్/6030/89 అని గుర్తు చేశారు. అందులో స్కూల్ కు, మందిరాలకు పోను 1 : 35 గుంటలను అమ్మడం జరిగిందన్నారు. మిగతా స్థలాలపై కూడా కేసులు ఉన్నాయని, పంప్ హౌజ్ ఉన్న 77 గజాలు కూడా మా స్వంత స్థలమేనన్నారు. అప్పట్లో దానిని బస్తీ కోసం వాడుకుంటామంటే ఒప్పుకోవడం జరిగిం దని, ప్రస్తుతం అది నిరుపయోగంగా ఉందన్నారు. అధికారులు పూర్తిస్థాయి విచారణ చేసి తమకు న్యాయం చేయాలన్నారు. విలేకరుల సమావేశంలో స్థలాన్ని కొనుగోలు చేసిన కె వేణుగోపాల్ గౌడ్ లు ఉన్నారు.

**జీహెచ్ఎంసీ లో తేల్చుకున్నాకే స్థలం వద్దకు వెళ్లాలి అని సూచించాం : ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి**

బుద్వేల్‌లో ఉన్న పంప్ హౌజ్ స్థలం మాదని పట్టాదారులు, బస్తీకి చెందినది అని బస్తీ పెద్దలు చెబుతున్నారని, ఈ విషయమై ఇరు వర్గాలు తమ దృష్టికి తీసుకురాగా, జీహెచ్ఎంసీ రాజేంద్రనగర్ సర్కిల్ లో తేల్చుకోవాలని సూచించడం జరిగిందని రాజేంద్రనగర్ ఎస్ఐ ప్రశాంత్ రెడ్డి తెలిపారు. అప్పటి వరకు ఆ స్థలం వద్దకు ఎవరు వెళ్ళవద్దని చెప్పడం జరిగిందన్నారు..

# ఆలంపూర్ ఆలయ విశిష్టత తెలిపేలా సౌండ్, లైట్స్ షో

## ప్రారంభించిన కేంద్ర బొగ్గు, గనుల శాఖల మంత్రి కిషన్ రెడ్డి





**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు30(ప్రభాత ఉదయం)**

దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన అలంపూర్ క్షేత్ర ఆధ్యాత్మిక, చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని వెలుగు ధ్వనుల సమ్మేళనంతో ఆవిష్కరించే మల్టీమీడియా, సౌండ్, లైట్ షోను రూ.4.60 కోట్ల నిధులతో కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ప్రసాద్ పథకంలో భాగంగా ఏర్పాటు చేయడంతో కేంద్ర బొగ్గు, గనుల శాఖల మంత్రి కిషన్ రెడ్డి ఆదివారం సాయంత్రం ఆలంపూర్ లోని ఆలయ ప్రాంగణం వద్ద ప్రారంభించారు. ఆలంపూర్ కు చేరుకున్న మంత్రికి పలువురుప్రజాప్రతినిధులు, జిల్లా అధికార యంత్రాంగం పుష్పగుచ్చాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. సౌండ్స్ లైట్ షో కార్యాలయంను కేంద్ర మంత్రి ఇతర అతిధులతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం మల్టీమీడియా సౌండ్ లైట్ షోను మంత్రి అతిధులు, ప్రజలతో కలిసి తిలకించారు.అంతకుముందు ఒగ్గు కళాకారులు అలంపూర్ ఆలయ విశిష్టతపై ప్రదర్శించిన ఒగ్గు కథ ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్, మహబూబ్ నగర్ లోక్ సభ సభ్యులు మల్లు రవి, డీకే అరుణ,ఆలంపూర్ ఎమ్మెల్యే విజేయుడు, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, యూత్ అడ్వాన్స్ మెంట్ టూరిజం అండ్ కల్చర్ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వాణి ప్రసాద్, తెలంగాణ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండి గౌతమి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ నర్సింగరావు, టూరిజం రీజినల్ డైరెక్టర్ వెంకటేష్, ఈడి ఉపేందర్ రెడ్డి, జిల్లా అధికారి రామలింగేశ్వర గౌడ్, ఆలంపూర్ మార్కెట్ యార్డ్ చైర్మన్ దొడ్డప్ప, మున్సిపల్ చైర్మన్ జయరాముడు, కమిషనర్ రాజేష్, ఇతర ప్రజాప్రతినిధులు,అధికారులు, పలువురు నేతలు, తదితరులు పాల్గొన్నారు.




## పెద్ద చింతరేవులలో వైభవంగా
# రాఘువేంద్ర స్వామి ఆరాధన పూజలు

**వైభవంగా మూలమూర్తులకు శత (100) హారతులు**

**ఉడిపి పాలిమార్ పీఠాధిపతుల 48వ చాతుర్మాస్య ఉత్సవాలు:ఆలయ ప్రధానార్చకులు ఆద్య చక్రవర్తి కేశవాచార్యులు**

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు30(ప్రభాత ఉదయం)**

జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల పరిధిలోని పెద్ద చింత రేవుల గ్రామంలో 15వ శతాబ్దం వ్యాసరాయుల కాలంనాటి వెలసిన ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో పెద్ద చింతరేవుల అన్న ప్రసాద ట్రస్ట్ అన్నసత్రంలో ఉడిపి పీఠాధిపతులచే మంత్రాలయ రాఘవేంద్ర స్వామి ఆరాధన ఉత్సవాలు వైభవంగా నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఆద్య చక్రవర్తి కేశవాచార్యులు తెలిపారు. శ్రీ 1008 శ్రీ విద్యాదిశ తీర్థ శ్రీపాదుల వారు, శ్రీ 1008 శ్రీ విద్య రాజేశ్వర తీర్థ శ్రీపాదలవారు శనివారం రాత్రి ఆదివారం ప్రత్యేకంగా శ్రీ రాఘవేంద్ర స్వామి ఆరాధన పూజలు ఉడిపి వేద పండిత బ్రాహ్మణోత్తములచే నిర్వహించారు.ఉడిపి పీఠాధిపతులు భాగవత రామాయణ ప్రవచనాలను చేశారు.పీఠాధిపతులు మూలమూర్తులైన శ్రీ సీతారామచంద్ర లక్ష్మణ సమేత హనుమంతునికి, నరసింహస్వామి వారికి,హైగ్రీవ స్వామి వారికి,ఉడిపి శ్రీకృష్ణుల స్వామి వారికి సంస్థాన ప్రత్యేక పూజలు వేదయుక్తంగా నిర్వహించారు.స్వామివార్లకు దశ విధాల శతహారతులు (వంద హారతులు) వైభవంగా సమర్పణ చేశారు.ఉడిపి శ్రీకృష్ణ స్వామి వారికి డోలారోహణ చేశారు. ఆలయ ఆవరణలో గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు. నిత్య హోమాల్లో భాగంగా పవమాన హోమం, నవగ్రహ హోమం ను భక్తులచే పేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్ద చింతరేవుల అన్న ప్రసాద ట్రస్ట్ వారిచే భక్తులందరికీ అన్న ప్రసాద పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఆద్య వామనాచారి, ఆధ్యా కిష్టాచారి, ఆద్య మద్వాచారి,ఉడిపి వేద పండితులు కర్ణాటక, తెలంగాణలోని వివిధ జిల్లాల నుండి భక్తులు పాల్గొన్నారు.



# జిల్లా కేంద్రంలో కారు భీభత్సం

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు30(ప్రభాత ఉదయం)**

జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ప్లై ఓవర్ పై ఆదివారం రాత్రి కారు నడిపిన వ్యక్తి బీభత్సం సృష్టించాడు. ఆదివారం రాత్రి కారు నడుపుతున్న వ్యక్తి గద్వాల నుంచి కర్నూల్ వైపు ప్లై ఓవర్ మీదుగా వేగంగా వెళ్తున్న క్రమంలో కారును సడెన్ గా గద్వాల వైపు తిప్పడంతో కారు అదుపుతప్పి డీవైడర్ ను ఢీకొట్టింది. దీంతో కారు పూర్తిగా డ్యామేజ్ అయింది. కారు నడుపుతున్న వ్యక్తి కారును వదిలేసి అక్కడ నుంచి పరారైనట్లు తెలుస్తోంది. అయితే కారు నడిపిన వ్యక్తి పూర్తిగా మద్యం మత్తులో ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అతివేగం, మద్యం మత్తే కారణమని ప్రత్యక్ష సాక్షులు ఆరోపించారు. అయితే కారు వనపర్తి జిల్లా పెబ్బేర్ మండలం రంగాపురం గ్రామానికి చెందింది గా గుర్తించారు. ప్రమాదానికి గల కారణాలు, ప్రమాదం చేసిన వ్యక్తులు ఎవరనేది తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదంలో ఎవరికి ప్రాణ నష్టం జరుగలేదు.

# గద్వాల జిల్లా ఇంటర్మీడియట్ విద్యార్థులకు లాంగ్ మెమోలు అందజేత

**జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎం. హృదయ రాజు**


**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు30(ప్రభాత ఉదయం)**



జోగులాంబ గద్వాల జిల్లాలోని ఇంటర్మీడియట్ విద్యార్థులకు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎం. హృదయ రాజు ఒక ప్రకటనలో ముఖ్యమైన సమాచారాన్ని తెలియజేశారు.2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్ వార్షిక (పబ్లిక్) పరీక్షలు , అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన విద్యార్థుల లాంగ్ మార్కుల మెమోలు ఇంటర్మీడియట్ బోర్డు నుండి సంబంధిత కళాశాలలకు చేరుకున్నాయని ఆయన తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థులందరూ తాము చదివిన కళాశాలల ప్రిన్సిపాళ్ళను సంప్రదించి, తమ లాంగ్ మార్కుల మెమోలను వెంటనే తీసుకోగలరని విద్యాధికారి సూచించారు.








# జిల్లా కేంద్రంలో భారీగా గంజాయి పట్టివేత

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు30(ప్రభాత ఉదయం)**

జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఆదివారం గద్వాల టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకోగ వారి నుంచి సుమారు 6కేజీల గంజాయి, ఒక వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఇటిక్యాల మండలం శనగపల్లి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు ఆదివారం సాయంత్రం గద్వాల వ్యవసాయ మార్కెట్ యార్డులో గంజాయి విక్రయించేందుకు రాగ గద్వాల టౌన్ ఎస్ఐ కళ్యాణ్ కుమార్ నమ్మదగ సమాచారం అందడంతో పోలీసులు మెరుపు దాడులు నిర్వహించి గంజాయి విక్రయదారులను అదుపులోకి తీసుకున్నారు. ఇద్దరిని పోలీసులు అరెస్టు చేయగా ఒకరు పరారయ్యారు. భారీగా గంజాయి దొరకడం జిల్లా కేంద్రంలో కలకలం రేపింది. తమ వ్యవసాయ పొలంలో గంజాయి సాగు చేసి విక్రయించేందుకు గద్వాలకు వచ్చారా లేదా గద్వాలలో గంజాయి సరఫరాదారులకు విక్రయించేందుకు వచ్చిన క్రమంలో పట్టుబడారా అనేది పోలీసుల విచారణలో తేలనున్నది. అయితే పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి ఎన్ని కేజీలుందో ఇంకా తెలియాల్సి ఉంది. విక్రయించేందుకు వచ్చిన వారు ఎక్కడ నుంచి తీసుకవచ్చారో పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది.



రాజిరెడ్డి పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న జలమండలి ఎండి అశోక్ రెడ్డి

# జలమండలి ఉద్యోగులు, కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం రాజిరెడ్డి అలుపెరగని కృషి

**కార్మిక నాయకుడు కె. రాజిరెడ్డికి నివాళులర్పించిన జలమండలి ఎండీ అశోక్ రెడ్డి**

**హైదరాబాద్, ఆగస్టు 30(ప్రభాత ఉదయం)**

జలమండలి సీనియర్ కార్మిక నాయకుడు కె. రాజిరెడ్డి భౌతికకాయానికి జలమండలి ఎండీ కె. అశోక్ రెడ్డి ఆదివారం పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. దీర్ఘకాలంగా జలమండలి ఉద్యోగులు, కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం రాజిరెడ్డి అలుపెరగని కృషి చేశారని కొనియాడారు. ఉద్యోగులు, కార్మికుల సమస్యలను ఎప్పటికప్పుడు యాజమాన్యం దృష్టికి తీసుకువస్తూ, వాటి పరిష్కారం కోసం నిబద్ధతతో పనిచేశారని గుర్తు చేసుకున్నారు.ఉద్యోగులు, కార్మికుల సమస్యలను తన సమస్యలుగా భావించి వారి పక్షాన నిరంతరం నిలిచిన నాయకుడు రాజిరెడ్డి. కార్మికుల హక్కుల పరిరక్షణకు ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం.అలాంటి నాయకుడిని కోల్పోవడం జలమండలి ఉద్యోగ, కార్మిక లోకానికి తీరని లోటు అని ఎండీ పేర్కొన్నారు.రాజిరెడ్డి మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేసిన ఎండీ.. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు వారి కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని ఆకాంక్షించారు.



# వివాహ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులకు వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆశీస్సులు

**కూకట్‌పల్లి, ఆగస్టు 30 (ప్రభాత ఉదయం)**

సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసాపేట సర్కిల్, కూకట్ పల్లి నియోజకవర్గం కూకట్‌పల్లి, ఎర్రగడ్డ ప్రాంతాల్లో ఆదివారం జరిగిన పలు వివాహ వేడుకల్లో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కూకట్‌పల్లిలోని నైనా కన్వెన్షన్, అశోక్ గార్డెన్స్, ఎర్రగడ్డలోని మెజిస్టిక్ గార్డెన్స్లో నిర్వహించిన వివాహ కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆత్మీయంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వధూవరులను ఆశీర్వదించిన వడ్డేపల్లి రాజేశ్వరరావు.. వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో, ప్రేమానురాగాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. నూతన దంపతులకు ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు సమృద్ధిగా కలగాలని, జీవితంలో అన్ని విధాలా అభివృద్ధి సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు. వివాహ వేడుకల్లో ఆయన పాల్గొనడంతో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఆనందం వ్యక్తం చేసి వడ్డేపల్లి రాజేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు.



# నూతన వధూవరులు మానస రాజవర్ధన్ రెడ్డిలను ఆశీర్వదించిన నాయకులు

**వివాహ వేడుకల్లో పాల్గొన్న జర్నలిస్టులు..**

కేడిదొడ్డి మండల వ్యవసాయ అధికారి రాజవర్దన్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారిణి మానసరెడ్డిల వివాహ వేడుకలు ఆదివారం శాంతినగర్ లోని భవాని ఫంక్షన్ హాల్ లో అత్యంత వైభవంగా జరిగింది.ఈ వేడుకలకు వ్యవసాయ అధికారులు సంగీత లక్ష్మి, భవాని, శ్రీలత, కరుణ శ్రీ, మండల వ్యవసాయ అధికారులు, ఆయా గ్రామాల సర్పంచ్ లు, జర్నిలస్టులు చుక్క సుదర్శన్ రెడ్డి, రవిబాబు, మల్లేష్ గౌడ్, వెంకటాపురం గోపి, పాండు, మండల నాయకులు, పార్చర్ల అంజినాయుడు, శివరామ్ , వ్యాపారులు, మండల నాయకులు, తదితరులు హాజరై నూతన దంపతులపై అక్షింతలు వేసి ఆశీర్వదించారు. నిండు నూరేళ్లు సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు.

# యువతి అదృశ్యం

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు30(ప్రభాత ఉదయం)**



కొండాపూర్ గ్రామానికి చెందిన పోతుల సుప్రియ (19) అనే యువతి అదృశ్యమైనట్లు బాధితురాలి తల్లి పోతుల దేవమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. కొండాపూర్ గ్రామానికి చెందిన పోతుల దేవమ్మ కుమార్తె పోతుల సుప్రియ ఈ నెల 28న రాఖీ పండగ సందర్భంగా వెంకంపేట గ్రామంలోని తన పెద్దమ్మ కుమారుడికి రాఖీ కట్టడానికి వెళ్ళింది. ఆ రోజు రాత్రి అక్కడే బస చేసిన సుప్రియ, మరుసటి రోజు ఈనెల 29న సాయంత్రం తన తల్లి దేవమ్మకు ఫోన్ చేసి "తాను కొండాపురం స్టేజ్ దగ్గర ఉన్నానని, ఇంటికి వస్తున్నానని" తెలిపింది. సమయం గడుస్తున్నా సుప్రియ ఇంటికి రాకపోవడంతో అనుమానం వచ్చిన కుటుంబ సభ్యులు, ఆమె బాబాయి జనార్దన్‌ను కొండాపురం స్టేజ్ వద్దకు పంపించారు. ఎక్కడ వెతికినా సుప్రియ ఆచూకీ లభించలేదు. చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో వెతికినప్పటికీ ఫలితం లేకపోవడంతో తల్లి దేవమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

# శిశుమందిర్‌లో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 30 (ప్రభాత ఉదయం)**




కరీంనగర్ నగరంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ హైస్కూల్ లో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలను ఉత్సాహభరితంగా నిర్వహించారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, జట్టుగా పనిచేసే తత్వం మరియు ఆరోగ్యకరమైన పోటీ మనస్తత్వాన్ని పెంపొందించే ఉద్దేశంతో వివిధ క్రీడా పోటీలను నిర్వహించడం జరిగింది. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పోటీల అనంతరం వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచి విజయం




సాధించిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానాచార్యులు మోర రణధీర్ మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర వికాసంలో విద్యతో పాటు క్రీడలు కూడా కీలక పాత్ర పోషిస్తాయని, ప్రతి విద్యార్థి క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. విద్యార్థులు క్రీడలను కేవలం పోటీగా కాకుండా ఆరోగ్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం మరియు నాయకత్వ లక్షణాలను పెంపొందించే సాధనంగా భావించాలని పాఠశాల కార్యదర్శి ఇంజనీర్ కోల అన్నారెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో సమితి కార్యదర్శి ఎలగందుల సత్యనారాయణ, గట్టు శ్రీనివాస్, బొడ్ల శ్రీనివాస్, కోట లక్ష్మారెడ్డి, కొత్తూరి ముకుందం, అప్పిడి వకుళా దేవి, డా ఎలగందుల శ్రీనివాస్, పులాల శ్యామ్, రాపర్తి శ్రీనివాస్, తాటి రాజేశ్వర్ రావు, మేచినేని దేవేందర్ రావు, ఆచార్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలిపింది.



మాతాజీ నిర్మల యోగ హారతి ని శాలువాతో సత్కరిస్తున్న బిజెపి నాయకురాలు వనితారెడ్డి

## హిందువులంతా ఏకమై హైందవ ధర్మం కోసం భాగస్వాములు కావాలి

**వీరులు ధర్మం కోసం పనిచేస్తారు: మాతాజీ నిర్మల యోగ భారతి**

**శంకర్ పల్లి, ఆగస్టు 30(ప్రభాత ఉదయం)**

వీరులు ధర్మం కోసం పనిచేస్తారని సచ్చిదానంద యోగా నంద మిషన్, శ్రీ వేణుగోపాల మందిర్ గోశాల అధ్యక్షురాలు మాతాజీ నిర్మల యోగ భారతి అన్నారు. ఆదివారం శంకర్పల్లి మండలంలోని శ్రీ వేణుగోపాల స్వామి మందిర్ గోశాల ను బిజెపి నాయకురాలు మేకలవనితారెడ్డి, గోశాల ప్రధాన కార్యదర్శి కుంభం నరసింహారెడ్డి తో కలిసి సందర్శించారు. గోవుల పెంపకం, వేద పాఠశాల లో జరుగుతున్న శిక్షణ ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందని మేకల వనిత రెడ్డి సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గోశాల నిర్వహణను నరసింహారెడ్డి వివరించారు. అనంతరం మాతాజీ నిర్మల యోగ భారతి ని ఆమె స్వగృహంలో కలిసి వనిత రెడ్డి శాలువాద సత్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా మాతాజీ నిర్మల యోగ భారతి మాట్లాడుతూ... సమాజంలో హిందువులంతా ఏకమై హైందవ ధర్మం కోసం భాగస్వాములు కావాలన్నారు. హిందూ ఆలయాల నిధులను ఇతర మతాల అవసరాల కోసం వినియోగించడాన్ని అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు.




జాతీయ క్రీడా దినోత్సవాలను ప్రారంభిస్తున్న రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సి నరేందర్ రెడ్డి




## రాజేంద్రనగర్‌లో జాతీయ క్రీడా దినోత్సవాలు

**బుద్వేల్, ఆగస్టు 30 (ప్రభాత ఉదయం):**

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు రాజేంద్రనగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవాలు ఆదివారం ముగిసాయి. మేజర్ ధ్యాన్ చంద్ జయంతి ని పురస్కరించుకుని శనివారం ఈ పోటీలను రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సి నరేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ అంతర్జాతీయ బ్యాడ్మింటన్ క్రీడా కారులు జయన్ జేమ్స్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల స్పోర్ట్స్ క్లబ్ బ్యానర్ ను ఆవిష్కరించారు. విద్యార్థులలో క్రీడా స్ఫూర్తిని పెంపొందిం చడానికి వివిధ క్రీడా పోటీలను నిర్వహించారు. బాలురకు వాలీబీల్, బాస్కెట్ బాల్, క్రికెట్ పోటీలతో పాటు అమ్మాయిలకు, అబ్బాయిలకు టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్, క్యారమ్స్, చెస్ వంటి ఇండోర్ గేమ్స్ నిర్వహించారు. కార్యక్రమంలో వర్శిటీ స్పోర్స్ విభాగం ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ కె రాజశేఖర్ రెడ్డి, కళాశాల ఓఐఎస్ఐ డాక్టర్ కె చైతన్య, స్పోర్ట్స్ గేమ్స్ ఇంచార్జి డాక్టర్ సైదా నాయక్ లు పాల్గొన్నారు.

## ఆంజనేయ నగర్ సంక్షేమ సంఘం ఘనంగా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

**కాలనీ అభివృద్ధికి నూతన కార్యవర్గం సమష్టిగా కృషి చేయాలి: బండి రమేష్**

**కూకట్‌పల్లి, ఆగస్టు 30(ప్రభాత ఉదయం)**

కూకట్‌పల్లి పరిధిలోని ఖైతలాపూర్ ఆంజనేయ నగర్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం స్థానిక కమ్యూనిటీ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. కాలనీ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గంగా ఎన్నికైన మహేందర్ ప్యానెల్ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య ఆహ్వానితులుగా టీపీసీసీ ఉపాధ్యక్షులు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ హాజరయ్యారు. కార్యక్రమానికి హాజరైన బండి రమేష్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. మహిళల భాగస్వామ్యం అభినందనీయంఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. ఆంజనేయ నగర్ సంక్షేమ సంఘం ఎన్నికలు ప్రశాంతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరగడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా ఈసారి ఎన్నికల్లో పెద్ద సంఖ్యలో మహిళలు ఉత్సాహంగా పాల్గొని కాలనీ సంక్షేమ బాధ్యతలను స్వీకరించడం ఎంతో




సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. కాలనీ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం మహిళలు ముందుకు రావడం మంచి పరిణామమని అన్నారు. నూతన కార్యవర్గం అందరినీ కలుపుకొని కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

**ఆంజనేయ నగర్‌తో తనకు ప్రత్యేక అనుబంధం**

ఆంజనేయ నగర్ సంక్షేమ సంఘం సభ్యుల్లో తాను కూడా ఒక భాగమని బండి రమేష్ తెలిపారు. అంతేకాకుండా కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయం కూడా ఇదే కాలనీలో ఉండటం వల్ల ఆంజనేయ నగర్‌తో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని అన్నారు.

కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కాలనీలో మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, రహదారులు, డ్రైనేజీ, విద్యుత్, తాగునీరు తదితర అంశాలకు సంబంధించిన సమస్యలను నూతన కార్యవర్గం గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కాలనీ సమస్యల పరిష్కారానికి అండగా ఉంటా

నూతనంగా ఎన్నికైన కార్యవర్గం నిరంతరం కాలనీ సమస్యలపై దృష్టి సారించి ప్రజలకు అందుబాటులో ఉండాలని బండి రమేష్ అన్నారు. సంక్షేమ సంఘం చేపట్టే ప్రజా ప్రయోజన కార్యక్రమాలకు తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఆంజనేయ నగర్ కాలనీ అభివృద్ధికి అవసరమైన ఏ కార్యక్రమమైనా తన దృష్టికి తీసుకువస్తే, సమస్యల పరిష్కారం కోసం తన వంతు సహకారం అందిస్తూ నూతన కార్యవర్గానికి అండగా ఉంటానని బండి రమేష్ స్పష్టం చేశారు. కాలనీ ప్రజల ఐక్యత, సంక్షేమ సంఘం కార్యవర్గం సమష్టి కృషితో ఆంజనేయ నగర్‌ను మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని ఆకాంక్షించారు.

నూతన కార్యవర్గానికి అభినందనలు ప్రమాణ స్వీకారం అనంతరం నూతన కార్యవర్గ సభ్యులకు నాయకులు, స్థానిక కాలనీ ప్రజలు అభినందనలు తెలిపారు. కాలనీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం చిత్తశుద్ధితో పనిచేస్తుందని సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఏ, బీ బ్లాక్ ఇన్‌చార్జిలు తూము వేణు, నాగిరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కర్క పెంటయ్య, లక్ష్మయ్య, ధర్మారావు, గోవింద్, రమణతో పాటు పలువురు స్థానిక నాయకులు, సంక్షేమ సంఘం సభ్యులు, కాలనీ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యుత్ వ్యవస్థ ఆధునీకరణ పేరుతో అదానీ పవర్ సంస్థకు అందించేందుకు రంగం సిద్ధం ?

**రాష్ట్రంలో విద్యుత్ భారం పెంచేందుకు రంగం సిద్ధమవుతోందా?**

**స్మార్ట్ మీటర్ల ఏర్పాటు అందులో భాగమేనా?**

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 30 (ప్రభాత ఉదయం):**




ఇటీవల జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే ఈ అనుమానాలు నిజమేననిపిస్తున్నాయి. తాజాగా టీఎస్‌పీడీసీఎల్ సీఎండీ జి. జితేష్ వి.పాటిల్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, వాటి వ్యయాన్ని వినియోగదారుల నుంచే విడతలవారీగా వసూలు చేసే అంశంపై చేసిన ప్రకటనలు ఈ సందేహాలకు మరింత బలం చేకూరుస్తున్నాయి. సాంకేతిక ఆధునీకరణ పేరుతో మొదలయ్యే ఈ ప్రక్రియ చివరికి విద్యుత్ బిల్లుల భారాన్ని పెంచే దిశగా సాగుతుందా? స్మార్ట్ మీటర్ల వెనుక కేవలం వినియోగాన్ని కొలిచే ఉద్దేశమే ఉందా? లేక విద్యుత్ పంపిణీ రంగాన్ని క్రమంగా ప్రయివేటు సంస్థలకు తెరవడానికి అవసరమైన మౌలిక వ్యవస్థను సిద్ధం చేస్తున్నారా? ఎందుకంటే, విద్యుత్ అంటే ఏ ఒక్కదానితో ముడిపడిన సమస్య కాదు, అది ప్రపంచాన్నే ప్రభావితం చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాది స్తున్న విద్యుత్ రంగ సంస్కరణలను ఈ పరిణామాలతో కలిపి చూస్తే అసలు చిత్రం కొంత స్పష్టమవుతుంది. 2025 విద్యుత్ సవరణ ముసాయిదా చట్టం విద్యుత్ టారిఫ్‌లు సరఫరా వ్యయాన్ని ప్రతిబింబిం చాలని, కొన్ని రంగాలకు లభిస్తున్న క్రాస్ సబ్సిడీలను ఐదేండ్లలో తొలగించాలని ప్రతిపాదిస్తోంది. అదే సమయంలో ఒకే ప్రాంతంలో ప్రభుత్వ, ప్రయివేటు డిస్కమ్‌లు పోటీ పడేందుకు, ఒక డిస్కమ్ నెట్‌వర్క్‌ను మరొకటి ఉపయోగించు కునే అవకాశాన్ని కల్పిస్తోంది. కేంద్రం దీన్ని 'పోటీ', 'నాణ్యమైన సేవలు'గా ప్రచారం చేస్తోంది. కానీ విద్యుత్ రంగంలో పోటీ అంటే ప్రజలకు చౌక విద్యుత్ అందుతుందన్న హామీ ఎక్కడుంది? లాభదాయకమైన పారిశ్రామిక, వాణిజ్య వినియోగ దారుల కోసం ప్రయివేటు డిస్కమ్‌లు పోటీ పడితే, అధిక వ్యయం ఉన్న గ్రామీణ ప్రాంతాలు, చిన్న వినియోగదారులు, పేద కుటుంబాలకు సేవల బాధ్యత ఎవరిది? క్రాస్ సబ్సిడీలను క్రమంగా తొలగిస్తే ఆ లోటును ఎవరు భర్తీ చేస్తారు? కేంద్రం మాత్రం రైతులు, పేదలకు సబ్సిడీ కొనసాగుతుందని చెబుతోంది. కానీ, ఆ సబ్సిడీని రాష్ట్ర బడ్జెట్ నుంచే భరిం చాల్సి ఉంటుంది. అంటే కేంద్రం సంస్క రణల నిర్ణయం తీసుకుని, ఆర్థిక బాధ్యతను రాష్ట్రాలపైకి నెట్టే అవకాశం ఉంది. ఇక్కడే స్మార్ట్ మీటర్ల ప్రాధాన్యం పెరుగుతోంది. స్మార్ట్ మీటర్ సాంకేతికంగా మెరుగైన పరికరమే కావచ్చు. కచ్చితమైన రీడింగ్, వినియోగ పర్యవేక్షణ, విద్యుత్ నష్టాల గుర్తింపు వంటి ప్రయోజనాలు ఉండొచ్చు. కానీ, ఎవరికి ప్రయోజనం చేకూరుతుంది, ఎవరు ఖర్చు భరిస్తారు? అన్నది అసలు ప్రశ్న. వినియోగదారుడే మీటర్ ఖర్చును విడతల వారీగా చెల్లించాల్సి వస్తే, ఉచితంగా లేదా సబ్సిడీతో అందే సేవలోకి మరో ఖర్చు చేరినట్టే కాదా? ఇంకా ఆందోళన కలిగించే అంశం ప్రీపెయిడ్ విధానం. కేంద్రం ఆర్‌డీఎస్‌ఎస్ కింద భారీ స్థాయిలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రోత్సహిస్తోంది. విద్యుత్ వినియోగానికి ముందే చెల్లించే విధానం విస్తరించినప్పుడు, డబ్బు లేని కుటుంబానికి విద్యుత్ వినియోగం ఎలా ఉంటుంది? ఇప్పటివరకు నెలాఖరులో బిల్లు చెల్లించే కుటుంబం రేపు ముందుగానే డబ్బు జమ చేయాల్సి వస్తే అది సామాన్యులపై ఆర్థిక ఒత్తిడిని పెంచదా? సాంకేతికత పేరుతో విద్యుత్ హక్కును 'చెల్లించే సామర్థ్యం'తో ముడిపెట్టడం ఎంతవరకు సమర్థనీయం? ఈ సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత కూడా తక్కువ కాదు. కేంద్రం ఏం చెబితే అది అమలు చేయడం మాత్రమే రాష్ట్ర ప్రభుత్వ పని కాదు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను కాపాడటం కూడా దాని రాజ్యాంగబద్ధ బాధ్యత. స్మార్ట్ మీటర్ల ఖర్చును వినియోగదారుల నుంచి వసూలు చేయాలంటే ముందుగా ప్రజలకు పూర్తి వివరాలు వెల్లడించాలి. మీటర్ ధర ఎంత? నిర్వహణ ఖర్చెంత? ఎన్ని సంవత్సరాలు వసూలు చేస్తారు? ప్రీపెయిడ్ విధానం తప్పని సరా? డబ్బు అయిపోతే సరఫరా నిలిపేస్తారా? పేదలు, రైతులకు రక్షణ ఏమిటి? వీటన్నింటికీ స్పష్టమైన సమాధానాలివ్వాలి. విద్యుత్ సంస్కరణల పేరుతో ప్రజలపై భారం మోపడం ఎంతటి ప్రమాదానికి దారితీస్తుందో ఉమ్మడి ఏపీలో జరిగిన బషీర్‌బాగ్ ఘటన చరిత్ర చెబుతోంది. పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా 2000 ఆగస్టు 28న జరిగిన 'చలో అసెంబ్లీ' సందర్భంగా బషీర్‌బాగ్‌లో పోలీసులు జరిపిన కాల్పుల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. అప్పటి చంద్రబాబు నాయుడు ప్రభుత్వ హయాంలో జరిగిన ఆ ఘటన విద్యుత్ భారానికి వ్యతిరేక ప్రజాఉద్యమంలో చెరగని ముద్ర వేసింది. దీన్ని పాల కులు మర్చిపోతే ఎలా? అప్పుడు చార్జీల పెంపు ప్రత్యక్షంగా కనిపించింది. ఇప్పుడు సంస్కరణలు, స్మార్ట్ మీటర్లు, ప్రీపెయిడ్ విధానం, ఖర్చు ఆధారిత టారిఫ్, ప్రయివేటు పోటీ వంటి పదాల వెనుక మార్పులు వస్తున్నాయి. వాటి అసలు ప్రభావం బిల్లులో కనిపించిన తర్వాత ప్రజలు ప్రశ్నించే పరిస్థితి రాకూడదు. విద్యుత్ వ్యవస్థ ఆధునీకరణ అవసరమే. కానీ, ఆ పేరుతో ప్రజల జేబులు ఖాళీచేసి, ప్రయివేటు సంస్థల ఖాతాలు నింపే సంస్కరణల్ని మాత్రం ప్రజాప్రయోజనం అనలేం.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608